క్లుప్తంగా

'ఈశ్వరమ్మది గొప్ప మనసు'



ఈశ్వరమ్మను సత్కరిస్తున్న ట్రస్ట్ యాజమాన్యం

ఇచ్ఛాపురం రూరల్: మూడు నెలలు పాటు చలివేంద్రంకు తాగునీరు సరఫరా చేస్తూ ప్రయాణికుల దాహార్తిని తీర్చిన ఈశ్వరమ్మది గొప్ప మనసు అని యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు అన్నారు. ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో నిర్వహించిన చలివేంద్రాల్లో సేవలందించిన ఆమెను ఎం.తోటూరులో శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం సాహుకారి కృష్ణమూర్తి, కౌన్సిలర్ సుగ్గ ప్రేమ్‌కుమార్, భైరి ఈశ్వరరావు, వరదరాజు, అభిమాన్యు సాహు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని డోలగోవిందపురం పంచాయతీ పరిధి రేఖాదేవిపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపడుతున్న రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హృషికేష్ పాత్రో, ఎంపీటీసీ సభ్యురాలు గన్ని లక్ష్మీబాయి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, జేసీసీ కన్వీనర్ కె.సురేష్, నేతలు బర్రి బసవరాజు, కర్తలి నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ వెంకటరావు, ప్రసాద్‌పాత్రో, పైల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా భార్గవి



ఇచ్ఛాపురం రూరల్: మండల వ్యవసాయాధికారిగా తారపురెడ్డి భార్గవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాధికారులను నియమించిన నేపథ్యంలో తొలి సారిగా ఏవోగా పదవీ బాధ్యతలు స్వీకరించానని, మండలంలోని వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో తాత్కాలిక వ్యవసాయాధికారిగా పనిచేసిన పిరియా శ్రీదేవి సీతంపేటకు బదిలీపై వెళ్లిపోయారు.


'విజయవంతంచేయండి'



జీపుజాతాలో పాల్గొన్న రైతులు

కవిటి: ఈనెల 18వ తేదీన కాశీబుగ్గ సంత మైదానంలో నిర్వహించనున్న జీడి రైతుల మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ జీడి పిక్కల రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు కవిటిలో జీపుజాతాను శుక్రవారం ప్రారంభించారు. ధర్నాకు కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా గతంలో మాదిరిగా జీడిపంటల విస్తరణకు తోడ్పాటు అందించాలన్నారు.

'ఉన్నత శిఖరాలు అధిరోహించాలి'



ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.జ్యోష్న, ఎస్.రమ్య, ఎ.హ్యాపి, బి.పవిత్ర, కె.పూనా రావుదొరలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం పాఠశాలలో వారికి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఈ ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.వైకుంఠరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు శంకుస్థాపన

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని మెట్టూరు పంచాయతీ పరిధి భవానీపేటలో జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా మంచి నీటి బోరు నిర్మాణానికి సర్పంచ్ లింగాల సంధ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జోగి అప్పారావు, అదిబలిజ సంఘ అధ్యక్షుడు లండ శ్రీను, చీకటి ధనుంజయ, సందుపల్లి మోహన్‌రావు, డొక్కరి దానయ్య, ఎం.తాతారావు, జి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జగనన్న సురక్ష

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష క్యాంపులు జోరుగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా సాంకేతిక సమస్యలతో పథకాలు అందనివారి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నారు. కావాల్సిన ధ్రువపత్రాలను వెంటనే జారీ చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సంతబొమ్మాళి: ఉమిలాడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి



పలాస: రెంటికోటలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సాయిప్రవీణ



ఇచ్ఛాపురం రూరల్: తులసిగాంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ పుష్ప తదితరులు



మందస: బెల్లుపటియాలో ధ్రువపత్రాలను అందజేస్తున్న దృశ్యం



కవిటి: ఆర్.కరాపాడులో ధ్రువపత్రాలు అందజేస్తున్న కడియాల ప్రకాష్ తదితరులు



నందిగాం: పెద్దలవునిపల్లిలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి తదితరులు



కోటబొమ్మాళి: కొత్తపేటలో ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటరమణారావు తదితరులు



ఇచ్ఛాపురం: ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు

'జీడి పరిశ్రమల అక్రమ లాకౌట్ ఎత్తివేయాలి'



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

మందస: జీడి పరిశ్రమల అక్రమ లాకౌట్‌ను తక్షణమే ఎత్తివేయాలని సీఐటీయూ, జిల్లా జీడి కార్మిక సంఘం ఆధ్వర్యంలో మందసలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 350 జీడి పరిశ్రమలున్నాయని, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోనే 300 వరకు ఫ్యాక్టరీలున్నాయన్నారు. 30 వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా, 40 వేలకు పైగా పరోక్షంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ తదితర చట్టపరమైన బెనిఫిట్స్ లేవని తెలిపారు. ఈ తరుణంలో పరిశ్రమ యాజమాన్యాలు జులై 5 నుంచి అక్రమ లాకౌట్ ప్రకటించి, కార్మికులకు ఉపాధి లేకుండా చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పరిశ్రమలు తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బి.పాపారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పేకల తేజేశ్వరరావు, ఎన్.గణపతి, కె.కేశవరావు, ఆర్.దిలీప్‌కుమార్, జి.బాలమ్మ, ఎస్.సరస్వతి, ఎం.కళావతి, వి.పద్మ, రైస్‌మిల్లు వర్కర్ల యూనియన్ నాయకుడు కె.బాలకృష్ణ, ఎం.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

తోటి విద్యార్థుల ఆపన్నహస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నందిగాం: ఒకప్పుడు తమతోపాటు పదో తరగతి వరకు చదువుకున్న తోటి విద్యార్థి కుటుంబం కష్టాల్లో ఉండడంతో పూర్వ విద్యార్థులంతా ఆపన్నహస్తం అందించారు. వివరాలను పరిశీలిస్తే 1998–99 సంవత్సరంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న సుభద్రాపురం గ్రామానికి చెందిన పత్తి శాంతకుమార్ పెయింటర్‌గా జీవనం సాగిస్తూ తన భార్య, పిల్లలను పోషించుకునేవాడు. అయితే ఏడాది క్రితం పెయింట్ వేస్తూ పైనుంచి పడిపోవడంతో నడుముకు దెబ్బ తగిలి మంచానికే పరిమితమై, ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులంతా అతని కుటుంబానికి మొదటి రూ.10 వేలు, తర్వాత శుక్రవారం మరో రూ.35 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సుభద్రాపురం సర్పంచ్ బోరుభద్ర సోమేశ్వరరావు, నడుపూరు రాంబాబు, వట్టి విశ్వనాథం, సనపల నాగేశ్వరరావు, మాదిన ప్రసన్న, అక్కురాడ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు అవగాహన కల్పించాలి'



నందిగాం: వ్యవసాయాధికారులకు సూచనలిస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

టెక్కలి: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేవిధంగా వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.వైకుంఠరావు కోరారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఎరువులు అందేవిధంగా చూడాలన్నారు. అలాగే రైతుల కోసం ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పథకాలు నేరుగా వారికి అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడీ బీవీ తిరుమలరావు మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీ ద్వారా టార్పాలిన్లు, స్ప్రేయర్లు అందజేస్తామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు. రైతులకు ఉచితంగా జీడి మొక్కలు, 50 శాతం రాయితీపై కూరగాయల విత్తనాలు, స్ప్రింక్లర్లు అందజేస్తామని ఉద్యానవన శాఖాధికారి సునీత వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

కవిటి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే యూరియా, డీఏపీ ఎరువులను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దువ్వు కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి డి.రూప అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. రైతులు వర్షాలు కురిసిన వెంటనే వరినాట్లుకు సిద్ధమవుతున్న తరుణంలో ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. పొలంగట్లపై కందిపంట పెంపకానికి సంబంధించి మండలానికి అవసరమైన మేరలో కంది విత్తనాలు పంపిణీకి పూర్తి రాయితీపై అందుబాటులో ఉంచామన్నారు. వ్యవసాయాధికారి డి.రూప మాట్లాడుతూ.. ఈ నెలాఖరు నాటికి పీఎం కిసాన్ రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ అయ్యేందుకుగానూ జాబితాలో ఉన్నవారు ఈకేవైసీ విధిగా చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యానశాఖ అధికారి పి.మాధవీలత పంటల యాజమాన్యంపై సిబ్బందికి సూచనలందించారు.

నందిగాం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావల్సిన ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రైతులు వేసిన విత్తనాలు కొన్నిచోట్ల మొలకెత్తలేదని, దీనిపై వీఏఏల ద్వారా సమాచారం సేకరించాలని సూచించారు. సమావేశంలో లట్టిగాం పీఏసీఎస్ అధ్యక్షుడు కురమాన బాలకృష్ణారావు, మండల ప్రత్యేకాహ్వానితుడు చిన్న జోగారావు, నాయకుడు అంబోడి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలో ఇటీవల ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ ప్రయోగశాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సూచించారు. మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి మాధవీలత, ఎంపీడీవో బి.వి.రమణ, పంచాయతీ రాజ్ ఏఈ రమేష్, ఎంపీటీసీ పాడుగు కామేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కుపల్లి గురుకుల పాఠశాల పరిశీలన

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి మత్స్యకార గురుకుల పాఠశాలను మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావు ఇచ్చిన వినతి మేరకు పర్యటించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పాఠశాల చైర్మన్ రూప, ప్రిన్సిపాల్ పాపారావు, పార్టీ నాయకులు రమేష్, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

'ల్యాబ్‌ను వినియోగించుకోవాలి'



ల్యాబ్ ప్రారంభిస్తున్న దృశ్యం

సోంపేట: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహకారంతో కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సూచించారు. జెడ్పీటీసీ తడక యశోద, రెడ్డీస్ ల్యాబ్ ప్రతినిధులతో కలిసి కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ల్యాబ్‌ను శుక్రవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 68 రకాల వైద్య పరీక్షలు కార్పొరేట్ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, పార్టీ నాయకులు బుద్దాన శ్రీకృష్ణ, శంకర్, మోహన్, పాపారావు, డిల్లీ, రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, పవన్ చౌదరి, జోగారావు, సురేష్, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సౌజన్య, నందిత, హెల్త్ ఎడ్యుకేటర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామం శివకాలనీకి చెందిన వడ్డి కరియ్యా, నారాయణమ్మ దంపతులు వయసు పైబడడంతో అనారోగ్యంతో ఇంటికే పరిమితమై, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలియడంతో గ్రామానికి చెందిన హెల్పింగ్ వారియర్స్ ఆధ్వర్యంలో బమ్మిడి వరప్రసాద్, తిరుమలలు రూ.5,500 నగదుతో పాటు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు శుక్రవారం అందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కవిటి: మండలంలో బొరివంక ఉప విద్యుత్ కేంద్రం పరిధిలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కవిటి ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ ఎం.నేతాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్‌కేఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల తొలగింపు నేపథ్యంలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సోంపేట: కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు కారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు బేసిరామచంద్రాపురం, కొర్లాం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

'చిత్తడి నేలలు సంరక్షిస్తాం'



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న పిరియా విజయ, పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు.

సోంపేట: సోంపేట బీల ప్రాంతంలోని చిత్తడి నేలల సంరక్షణకు కృషి చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బీల ప్రాంతంలోని థర్మల్ ఉద్యమం అమరవీరుల స్థూపం వద్ద 13వ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. థర్మల్ స్థూపం వద్ద అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజా పోరాటంతోనే పవర్‌ప్లాంట్ నిలుపుదల జరిగిందని పిరియా విజయ తెలిపారు. అప్పట్లో తాము కూడా ఉద్యమకారుల వెనుక నడిచామని గుర్తు చేశారు. ఉద్యమకారులపై ఉన్న కేసులు ఎత్తి వేయడంతో పాటు, బీల ప్రాంతాన్ని రక్షించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ శాఖాన్ నివేదిక ప్రకారం ప్రపంచంలోని అత్యంత విలువైన సోంపేట చిత్తడి నేలలు పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. మానవ హక్కుల సంఘ ప్రతినిధులు వీఎస్ కృష్ణ, డి.జగన్నాథం తదితరులు మాట్లాడుతూ సోంపేట ఉద్యమం పర్యావరణ పరిరక్షణకు స్ఫూర్తిపాఠమన్నారు. కార్యక్రమంలో సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, పర్యావరణ పరిరక్షణసంఘ కార్యదర్శి తమ్మినేని రామారావు, డాక్టర్ ప్రధాన శివాజీ, సత్యరాజ్, మాజీ జెడ్పీటీసీ సూరాడ చంద్రమోహన్ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలి'



ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ తదితరులు

టెక్కలి: పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఆయా పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలని డీఎల్‌పీవో ఐ.వి.రమణ సూచించారు. మండలంలోని సీతాపురం పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మి కంపోస్టును తయారు చేసుకుని, వాటిని రైతులకు అమ్మకాలు చేపట్టాలన్నారు. దీనివలన ఒక వైపు ఆదాయంతో పాటు మరో వైపు రైతులకు మంచి ఎరువులు అందజేయవచ్చునని పేర్కొన్నారు. అనంతరం జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈయనతో పాటు పంచాయతీ కార్యదర్శి రామ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బెండి ఉదయ్, తుంటు జగ్గారావు, బి.అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్వహణపై అసంతృప్తి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో నిర్వహిస్తున్న మఠం కంచిలి, కంచిలి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రాలను శుక్రవారం ఉదయం ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ రెండు కేంద్రాలకు కలిపి ముగ్గురు పిల్లలు మాత్రమే ఉదయం 10.15 గంటల తర్వాత హాజరయ్యారు. అంగన్‌వాడీ హెల్పర్ 10.30 గంటలకు విధులకు హాజరయ్యారు. అదేవిధంగా కేంద్రాల్లో రోజువారీ ఆహార పట్టిక ప్రదర్శించలేదు.

సిబ్బంది, పిల్లల హాజరు పట్టికలు ఇప్పటివరకు చూపించలేదు, భవనం ముందు అపరిశుభ్రంగా ఉంది, పిల్లలకు తగిన ఆట వస్తువులు లేవని గుర్తించారు. దీనిపై ఐసీడీఎస్ పీవో ఇందిర, రెండు కేంద్రాల టీచర్లను ఎంపీపీ ఆఫీస్‌కు రావల్సిందిగా ఆదేశించారు.

నౌపడ పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

సంతబొమ్మాళి: నౌపడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ జీఆర్ రాధిక శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులతో ఎస్పీ సమావేశం నిర్వహించి వారు నిర్వహించే విధులపై పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని ప్రజలకు సైబర్ క్రైమ్, మహిళల రక్షణ, పోక్సో చట్టం, దిశ యాప్‌లపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లోని అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని, నాటుసారా, మద్యం, గంజాయిల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజెప్పాలన్నారు. అనంతరం రికార్డులు, ఫైల్స్ పరిశీలించారు. కానిస్టేబుళ్లు వారి దత్తత గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించాలని, గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు.

సంక్షిప్తంగా..

మెరిసిన విద్యార్థులు

ఇచ్ఛాపురం: ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు మెరిశారు. హిస్టరీలో పొన్నంగి శివాజీ 36వ ర్యాంకు, కెమికల్ సైన్స్‌లో పండా రక్షికుమారి 206వ ర్యాంకు, దల్లి భవానీ 418వ ర్యాంకు, బోటనీలో ఎన్.రోజా 386 ర్యాంకులను సొంతం చేసుకున్నారు. వీరిని కళాశాల సిబ్బంది అభినందించారు.

'మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు'

టెక్కలి: గ్రామాల్లో అవసరమైన చోట సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ వనరుల కేంద్రం ఆర్పీ శాంతికుమార్, రాజేశ్వరరావు, ఎంపీడీవో హెచ్.వి.రమణమూర్తి, ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని అస్త్రంతో పంటలకు మేలు

వజ్రపుకొత్తూరు: అగ్ని అస్త్రంతో కూరగాయల పంటలకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం పీఆర్పీ పెంటయ్య అన్నారు. మండలంలోని సైనూరు గ్రామంలో రైతులకు వంగ తోటలో పురుగుల నివారణకు అగ్నిఅస్త్రం మందు తయారీ విధానంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. తయారీ విధానం, కావాల్సిన ముడి సరుకులు, ఇరత పద్ధతులను వివరించారు. సులభంగా అతి తక్కువ ఖర్చుతో తయారైన మందుకు పురుగులు పటాపంచలై ఆరోగ్యకరమైన కూరగాయలు పండించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ గున్న వెంకటరమణ, సీహెచ్ సంధ్యారాణి, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.